# 5. చేయూత

"ఉదయం ఓ గంట నడకా, రెండుగంటలు పాఠాలూ. సాయంత్రమో గంటనడకా, రెండుగంటలు పాఠాలూ. క్రమం తప్పకూడదు. ఆరోగ్యం చెడగొట్టుకుంటూ ఎందుకండీ మీకీ సమాజ కార్యక్రమాలంటే వినరు" ప్రభాకర్ తండ్రి మీద వేష్టపడుతున్నాడు.

"రిటైరయ్యి పదేళ్ళయింది. ఏ చీకూచింతా లేకుండా రామాకృష్ణా అనుకుంటూ కూర్చోక ఎందుకొచ్చిన తిరుగుళ్ళు? ఆ సమాజమేమన్నా దగ్గరా, దాపా?" తనవంతు బాణాన్ని తానూ వదిలాడు సుందర్.

హాస్పటల్ రూమ్. నరసింహంకి ఆపరేషన్ జరిగి ఆరు రోజులైంది. కుడికాలికి పెద్ద ఫ్రాక్చర్. రాడ్‌లు వేశారు.

నీరసంగా కళ్ళు మూసీ, తెరిచీ కొడుకుల మాటల్ని వింటున్నాడు నరసింహం. మధ్య మధ్యలో భార్య శారద కళ్ళల్లోకి చూస్తున్నాడు. ఆమె బిక్కమొహంతో భర్త మంచం తలవెంపున స్టూల్‌మీద కూర్చుని ఉంది. గుంటలు పడ్డ కళ్ళతో, పీక్కుపోయిన మోహంతో దిగులు దిగులుగా వుంది. కదిలిస్తే ప్రిదిలిపోయే నీటి బుడగలా వుంది. మూగశ్రోతగా, మౌన ప్రేక్షకురాలులా వుంది.

బయట హడావిడిగా వుంది. వచ్చీపోయే జనం. విజిటర్స్ అవర్స్ ఏడుగంటలకి సమయం ముగుస్తుంది. ఇప్పుడు ఆరుదాటుతోంది.

తనకు జరిగిన ప్రమాదమూ, ఆ సంఘటనా కళ్ళముందు మెదిలాయి నరసింహంకి. ఆవేళ – రాత్రి ఏడున్నరయింది. సమాజంనుండి తిరిగొస్తున్నాడు తాను. రోడ్డు వారగా పేవ్‌మెంట్ పక్కగానే నడుస్తున్నాడు. ఎడమవైపు క్రాస్‌రోడ్‌లో నుంచీ మోటార్‌బైక్ మీద యువకుడు మలుపు తిరుగుతూ ఢీకొట్టాడు. ఆ వేగానికీ, తాపుకీ ఎగిరి పదిగజాల దూరంలో పడ్డాడు తాను. పడింది పరుపుల దుకాణంలోని పరుపుమీద. తరుగులో మెరుగు. తలకాచుకుంది! కుడికాలు 'ఫెమూర్' నుజ్జునుజ్జు అయిందిట. ఆపరేషన్! నాలుగురోజులు యస్ఐసియూలో నానారకాల కట్లూ, మరకలూ, కుట్లూ, పొడుపులూ! నిన్న గదికి మార్చారు.

పెదవులు దాటిరాని ఏడుపుతో శారద. ప్రభాకర్, సుందర్‌ల విసుగూ, వేష్టా, వ్యాఖ్యలూ! కోడళ్ళ ముఖప్రీతి పరామర్శ! నలుగురు మనవళ్లకీ– స్కూలు బిజీ! చిత్రమైన సన్నివేశం అనిపించింది నరసింహంకి.

నరసింహం ఆలోచనలు సాగుతుండగానే, సిస్టర్ చేతిలో కాగితంతో ప్రవేశించింది. 'మిమ్మల్ని ఐ.పి. బిల్లింగ్‌లో ముప్పైవేలు కట్టమంటున్నారు' అంటూ కాగితాన్ని ప్రభాకర్ చేతిలో ఉంచి వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయింది.

ప్రభాకర్ బిల్లుని చూసి, మొహం చిట్లించుకుని సుందర్ చేతికందించాడు దాన్ని. అతను దాన్ని పరికించకుండానే, "ఇదీ వరస. బుడబుడా కార్పొరేట్ హాస్పటల్లో చేరితే ఇంతే సంగతులు. దండగమారి ఖర్చు. కుదిచి కూర్చుండక అడ్డమైన తిరుగుళ్ళు. ఫలితం ఇదీ" అంటూ రుసరుసలాడాడు. తమ్ముడికి వంతపాడుతూ "చెప్తే వినే ఘటాలయితే ఏవైనా చెప్పొచ్చు" అంటూ విసుక్కున్నాడు ప్రభాకర్.

కొడుకుల మాటలు శారద గుండెల్లోకి కాల్చిన కత్రుపోటులా దిగాయి. దుఃఖం పొంగుకొచ్చింది. ముక్కుపుటాలదిరినై. ఏడుపు గొంతుకని ఎగదట్టింది. "బాగున్నాయ్‌రా మీ మాటలు. చాలా బాగున్నై. గొప్ప ప్రయోజకులైపోయారు. తండ్రికి మంచి మంచి కితాబులే ఇస్తున్నారు. ఇంత బతుకూ బతికి చివరికి కొడుకుల చేతే మాటలు పడాల్సొస్తోంది. కర్మ. మా మంచి సంతానం. రేయ్. మీ కోసం, మీ భవిష్యత్తు కోసం ఆయన పడిన కష్టాలూ, చేసిన చాకిరీ అంతా మరిచిపోయారు. పోనీండి. అడ్డాలనాడు బిడ్డలుకానీ, గడ్డాలనాడు బిడ్డలా అన్నదిందుకేనేమో. మంచి అంతా కాలగర్భంలో కలిసిపోతే పోయింది, ఇదిగో – ఇదేమవుతుందిరా కొడుకుల్లారా?" అని ఉద్వేగంతో, ఉద్రేకంతో స్టూలుమీంచీ లేచి భర్త ఎడమకాలిమీది డ్రెస్‌ని తొలగించింది. "చూడండిరా.. గుర్తుందా. మిమ్మల్నిద్దర్నీ కలిపి ఎద్దుకుమ్మినప్పుడు మిమ్మల్ని రక్షించి, ఆ ఎద్దునుంచీ తాను పొందిన బహుమతి కదరా ఇది!" అంటూ తనను తాను నిబ్బరించుకోలేక, పైకే పెద్దగా ఏడ్చేసింది.

"ఏవిఁటే... నీకేమైంది. ఊరుకో... ఊరుకో" అంటూ భార్య బుజం తట్టి ఊరడించాడు నరసింహం.

వాతావరణం గంభీరంగా మారింది.

చాలా సమయం నిశ్శబ్దంలోకి జారింది.

"చూశారా. లక్ష కట్టి కూర్చున్నాం. మళ్ళీ ఇవిగో మరో ముప్పైకి తాఖీదు. అదీ నా మాట" సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు అన్నాడు ప్రభాకర్.

"ఇట్లా ఎంతకి దేకుతుందో ఈ ఖర్చు అని మా బాధ" సుందర్ కూడా అన్న ధోరణికి మద్దతు పలికాడు.

శారద మామూలు స్థితికి వచ్చింది. అప్పుడు మళ్ళీ మొదలెట్టాడు ప్రభాకర్. "అసలు మాకు అర్థంకాని విషయం... " అని అర్థోక్తిలో ఆపి, తండ్రి కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ "ఇన్నేళ్ళ నుంచీ మీకొస్తున్న పెన్షన్‌లో పైసా మిగులు లేక పోవటమే ఆశ్చర్యంగా వుంది" అన్నాడు. "ఉన్న రెండు బ్యాంక్ ఎకౌంట్లల్లోనూ కేవలం మినిమమ్ బ్యాలెన్స్‌లేగా వున్నది" సుందర్. "నెలకి పదిహేనువేలు పైమాటే గదా జమ అవుతూ వస్తోంది. పైగా అడపా దడపా ఎరియర్స్ కలుస్తున్నై" ప్రభాకర్. "రియల్లీ సర్‌ప్రైజింగ్" సుందర్. "పోనీ నువ్వన్నా చెప్పవమ్మా అంటే – ఈమెదో తరహా, మాటకు ముందు నెత్తిమీది నీళ్ళకుండ పగులుతుంది" ప్రభాకర్ చేతులు తిప్పుతూ చిరాకుని వ్యక్తం చేశాడు.

మూగగా నేలచూపులు చూసింది శారద. బెడ్‌షీట్‌ని బుజాలదాకా సరిచేసుకుని అన్నాడు నరసింహం. "చాలా ఏళ్ళ క్రితమే మీరిద్దరూ చెప్పేశారు కదరా– 'మీ డబ్బేమీ మాకక్ఖర్లేదు, ఎవరి బతుకులు వాళ్ళుగా బతుకుదాం" అని. ఇప్పుడిట్టా రంకెలేస్తారెందుకు– ఏదో ఆకాశం ఊడిపడ్డట్టు. డబ్బు గురించి వర్రీ కాకండి. నా ఏర్పాటు నేను చేసుకుంటాను. మీరు చెల్లించిన డబ్బునీ...."

తండ్రి మాటకు అడ్డొచ్చాడు ప్రభాకర్. "అదేమంటే ఇదీ ధోరణి. ఏదో ఏర్పాటు చేసుకుంటానంటున్నారే, ఏదీ ఈ ఆరు రోజుల్లోనూ పరామర్శ కొచ్చిన ముగ్గురు నలుగురిలో ఏవొక్కరైనా డబ్బు ప్రసక్తి తెచ్చారా? మీరు ఆశిస్తున్న మంచితనం, గౌరవం, పరపతీ అన్నీ ఆకాశ చిత్రాల్లాంటివి. మీరు పెట్టిన వాళ్ళెవరూ మీకు సహాయం చేయటానికి రారు. చివరికి మేం చూడాల్సిందే. మేం చెయ్యాల్సిందే"

శారదకి మనసు కలుక్కుమంది. కొడుకు మాట్లాడుతున్నది నరసింహం తమ్ముడు సత్యానందం, ఆయన కొడుకు రామారావు గురించి – అని ఆమెకు అర్థమవుతూనేవుంది. వాళ్ళ అభివృద్ధి కోసం– ఈయన టీచర్ సంపాదనతోనే చాలా చేశారు. వాళ్ళంతా ఇప్పుడు అమెరికాలో సెటిల్ అయ్యారు. సత్యానందం ఇక్కడే వుంటాడు. నిన్న వచ్చి శూన్యహస్తాలు చూపి, శుష్కప్రియాలు చెప్పి వెళ్ళాడు.

"బాగానే దెప్పుతున్నావ్‌రా ప్రభాకర్" అంది శారద– ఆలోచలనుంచి ప్రస్తుతానికొస్తూ.

"దెప్పటం కాదమ్మా. పరిస్థితి చెబుతున్నా. చేతిలో పైసాలేకుండా కార్పొరేట్ హాస్పటల్‌కి వచ్చేస్తిరి"

"ఆర్థోలో ఇది బెస్ట్ అనీ, జరిగింది పెద్ద ప్రమాదమనీ – పట్టు పట్టమని ఎవరో ఇక్కడికి తెచ్చేశారు. ఆ పరిస్థితినంతా చెప్పానుగదా" అని మెతక స్వరంతో అన్నది శారద.

"చిత్తశుద్ధి పోయిన తర్వాత మనసు ముళ్ళకంచే అవుతుంది" అని నిట్టూర్చి, కళ్ళు మూసుకున్నాడు నరసింహం.

నరసింహం అపసోపాలు పడసాగేడు, ఆయనకు అటు కొడుకుల ప్రవర్తన వలన మానసికంగానూ, ఇటు వైద్య పరికరాలతో దైహికంగానూ బాధగా వుంది. ఎడమ చేతికి కట్టిన మానిటర్ నరాల్ని బిగిస్తోంది. యూరిన్‌బ్యాగ్ కొక కనెక్షన్, అనీజీగా వుంది. వొళ్ళంతా సలుపుగా వుంది. పక్కకుదరటం లేదు.

బయట జనప్రవాహపు కోలాహలం సాగుతూనే వుంది. రకరకాల మాటలు. హాస్పటల్ నిర్వహణమీద వ్యాఖ్యలూ, రోగుల ఆరోగ్యం గురించి ఆందోళనలూ వినిపిస్తున్నాయ్.

క్షణాలు గడుస్తున్నై.

హడావిడిగా 'ఇదే రూమ్' అంటూ లోపలికొచ్చారు సమాజం కార్యదర్శి హనుమయ్యగారు. ఆయన వెనగ్గా కార్యకర్తలు చంద్రికా, వనజా, వారి పక్కగా వో పాతిక ముప్పై ఏళ్ళ యువకుడూ రూమ్‌లోకొచ్చి నిలబడ్డారు. వీళ్ళందర్నీ చూసి, ప్రభాకర్, సుందర్ – కారిడార్ చివరినుంచీ వచ్చి రూమ్ గుమ్మం బయట నిలబడ్డారు.

హనుమయ్యగారు నరసింహం యోగక్షేమాల్ని వివరించారు. తాము తెచ్చిన పండ్లబ్యాగ్‌ని కాబినెట్‌పైన ఉంచింది చంద్రిక. కొద్దిక్షణాలు సమాజ కార్యక్రమాన్ని విచారణ చేశాడు నరసింహం. ఆయన్ని వారిస్తూ 'మీరు రెస్ట్ తీసుకోండి. అవన్నీ తర్వాత చూసుకోవచ్చు" అన్నారు హనుమయ్యగారు. ఆయన అప్పుడు చూశారు ప్రభాకర్‌నీ, సుందర్‌నీ. పలకరించాడు. "చాలా శ్రమ తీసుకుని నాన్నగారిని చూసుకుంటున్నారు. బాగుంది" అన్నాడు. ఈయనే తండ్రిని ఈ హాస్పటల్‌లో చేర్చినట్లు చూచాయగా తెలుసు ప్రభాకర్‌కీ, సుందర్‌కీ. ఆయన మాటలు బుజాలు తడుముకొనేటట్టు చేసినై అన్నదమ్ముల్ని. పొడినవ్వు నవ్వేరు.

హనుమయ్యగారు ఆ యువకుణ్ణి పరిచయం చేశారు. "సారీ, మనం కబుర్లలో పడ్డాం" అని "ఇతను ప్రసాద్ నరసింహంగారూ, మీరు గుర్తుపట్టలేదు" అంటూ కొనసాగించాడు. "చిన్నతనంనుంచీ మన సమాజంలో చదువుకుని పెద్దవాడైనాడు. నాలుగేళ్ళ క్రితం ఎంబియ్యేఫైనాన్స్ చేసి ముంబై వెళ్ళిపోయాడు. ఇప్పుడు అక్కడే ఉద్యోగం."

ప్రసాద్ నరసింహంకీ, శారదకీ నమస్కరించాడు. ఆ తర్వాత ప్రభాకర్‌కీ, సుందర్‌కీ హలో చెప్పాడు. నరసింహం సంతోషంతోనూ, సంతృప్తితోనూ కళ్ళు చికిలించాడు. అప్పుడన్నాడు ప్రసాద్, "మీ వంటివారి ఆదరణ వల్లనే ఇట్లా వున్నాను సార్. పీడబ్ల్యుసీలో మంచి ఉద్యోగమే వచ్చింది. మీరు నా చదువు మొత్తానికీ స్పాన్సర్ అనీ, మీకిలా మేజర్ యాక్సిడెంట్ జరిగిందనీ హనుమయ్యగారు తెలియజేశారు. మిమ్మల్ని వెంటనే చూడాలని వచ్చేశాను" అంటుంటే అతని కళ్ళల్లో నీరు తిరిగింది. కర్చీఫ్‌తో తుడుచుకొన్నాడు.

ప్రభాకర్, సుందర్ మొహమొహాలు చూసుకున్నారు.

హనుమయ్యగారూ, చంద్రికా, వనజా- ముగ్గురూ - నరసింహం ఔదార్యం గురించి ప్రస్తావిస్తూ మాటల్లో పడ్డారు. "నెలా నెలా మీరందించిన సహాయం ప్రసాద్ లాంటి యువకుల అభ్యున్నతికి ఎంతగానో అందివచ్చింది. మన సమాజం నిబంధనల ప్రకారం ఏ దాత విరాళం ఏ వ్యక్తి ఖర్చుకి వాడతామో చెప్పకూడదు. కానీ, ఈ ఐదారు రోజుల్లో ఇక్కడ మీకు జరుగుతున్న 'ట్రీట్‌మెంట్' గురించి నాకు వివరంగా తెలిసింది. అందుకని, నా బాధ్యతగా భావించి నేను ప్రసాద్‌కీ వివరాలు చెప్పాను. అతనేమో వెంటనే పరిగెత్తుకొచ్చాడు" అని వివరణ ఇచ్చారు హనుమయ్యగారు.

నరసింహం, శారదా మౌనంగా విన్నారు. హనుమయ్యగారి సంభాషణలో 'ఇక్కడ జరుగుతున్న ట్రీట్‌మెంట్' అన్న పదాల్ని పలుకుతూ ఆయన విసిరిన విరుపుతో అయోమయంగా దిక్కులు చూశారు అన్నదమ్ములు. తమ మనసుల్ని ఆయన ఒడిసిపట్టుకుని మెదిపి చాలాదూరం విసిరేశాడన్న భావన కలిగింది. క్షణంలో తెప్పరిల్లి తెరమీది దృశ్యాలు పట్టనివారిలా నిలబడ్డారు.

హనుమయ్యగారు నరసింహం ట్రీట్‌మెంట్ గురించిన కబుర్లేవో చెబుతున్నారు.

ఇంతలో వార్డ్‌బాయ్ గదిలో కొచ్చాడు. నరసింహం చేతికో కాగితం అందించి, "ఇదిగో సార్ మనీ రిసీట్. ఎడ్జస్ట్‌మెంట్లన్నీ డిశ్చార్జ్ అప్పుడు చేస్తార్ట" అని వెంటనే వెళ్ళిపోయాడు.

నరసింహం ఆ కాగితాన్ని చూశాడు. రెండులక్షల రూపాయలకు రశీదు! సంభ్రమానికి లోనయ్యాడు. ఆయన చూపులు హనుమయ్యగారిని ప్రశ్నిస్తే, హనుమయ్యగారు తన చూపుని ప్రసాద్ వైపు సారించాడు.

ప్రసాద్ ముందుకు కదిలి, బెడ్ దగ్గరగా వచ్చి, నరసింహం కాళ్ళ దగ్గర వంగి, నమస్కరించి, వినయంగా పాదాల్ని కళ్లకు అద్దుకున్నాడు. "మీరు త్వరలోనే పరిపూర్ణ ఆరోగ్యవంతులవుతారు సార్" అంటూ ఎంతో భావోద్వేగంతో "నన్ను ఆశీర్వదించండి" అన్నాడు.

శారద కళ్ళల్లో నీళ్ళు నిండాయి. నరసింహం కూడా భావోద్విగ్నతకు లోనయ్యాడు. నిండు హృదయంతో "ఆయురారోగ్య భోగభాగ్య ప్రాప్తిరస్తు" అని చెయ్యెత్తి దీవించాడు.

ప్రసాద్ లేచి నిలబడ్డాడు.

గౌరవంగా, ప్రేమగా, ఆప్యాయంగా – నరసింహం చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని 'మా వంటి అనాధలకి ఇవి చాలా విలువైన సహకార హస్తాలు సార్" అన్నాడు ఎంతో ఆర్ద్రంగా.

కొంచెం మార్పుతో అదే వాక్యాన్ని తన మనసులో అనుకున్నాడు నరసింహం.

మిగిలిన వారంతా ఎవరి భావాల్లో వారు మునకలేస్తూ చూస్తున్నారు!! ప్రభాకర్‌కీ, సుందర్‌కీ మాత్రం ఇదంతా అయోమయంగా వుంది!!!

(చిత్ర మాసపత్రిక, నవంబరు 2013)